PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :150 | పేజీలు : 8 | వెల రూ.5 | మంగళవారం. 16.06.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh

WANTED
ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాధరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన.. తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించగలరు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
prabhathasuryudueditor@gmail.com
https://youtube.com/@PrabhathaSuryuduNews
70326 93467
WANTED REPORTERS

# మోదీ హామీల లెక్క తేల్చండి..

## ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 15 ప్రభాత సూర్యుడుఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేస్తారా? అంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'మోదీ హామీల లెక్క తేల్చండి.. ఆ తర్వాత నా రాజీనామా గురించి మాట్లాడండి' అంటూ ప్రతి సవాల్ విసిరారు.సోమవారం సచివాలయంలో మీడియాతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై ముందుగా సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశ ప్రజలకు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, విదేశాల్లోని నల్లధనాన్ని తీసుకువచ్చి ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని మోదీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ హామీలు ఎంతవరకు అమలయ్యాయో దేశ ప్రజలకు స్పష్టత ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, ప్రతి ఖాతాలో రూ.15 లక్షల జమ వంటి కీలక హామీలు నెరవేర్చకపోయినా వాటిపై ఎవరూ ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. తన ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న కిషన్‌రెడ్డి ముందుగా వీటికి సమాధాని చెప్పాలని నిలదీశారు. ఎన్నికల హామీలు అమలు కాలేదనే కారణంతో ప్రధాని మోదీ తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధపడితే, తాను కూడా తన కేబినెట్‌ను రద్దు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సీఎం స్పష్టం చేశారు.

**మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయి..**

మెట్రో విస్తరణను బీఆర్ఎస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మెట్రో విస్తరణ జరిగేచోట బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలే ఉన్నారని తెలిపారు. సమస్యలపై మాట్లాడదామంటే కేంద్రమంతి కిషన్‌రెడ్డి సమయం ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి బాధ్యత తీసుకుని మాట్లాడాలని సూచించారు. మెట్రో విస్తరణకు కిషన్‌రెడ్డి నిధులు విడుదల చేయిస్తారా? లేదా? అని ప్రశ్నించారు. లోన్ బదిలీ కాకుండా కిషన్‌రెడ్డి వల్లే మెట్రో విస్తరణ ఆగిందని ఆరోపించారు. మెట్రో విస్తరణకు రూ.40 వేల కోట్లు కావాలని సూచించారు. అంతా తామే భరిస్తామని.. చీూజ ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యం లేకుండా మెట్రోను తాము విస్తరిస్తామని కేంద్ర పెద్దలతో తాము చెప్పామని పేర్కొన్నారు

**మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారు..**

రాజకీయంగా నష్టం జరుగుతోందని మెట్రోపై కిషన్‌రెడ్డి కుట్ర పన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రుణం ఇవ్వకపోతే కనీసం చీూజ అయినా ఇప్పించరా? అని నిలదీశారు. నిధులు ఇప్పించి చీూజ ఇస్తే శాలువా కప్పి ఆయనను సన్మానిస్తామని తెలిపారు. కిషన్‌రెడ్డిని కేసీఆర్ తిట్టినట్లు తాను తిట్టలేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ డైరెక్షన్‌లోనే కేంద్రమంత్రి పనిచేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు లొంగిపోయి కిషన్‌రెడ్డే అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ఆయన వెనుక కేటీఆర్ ఉన్నారని ఆరోపించారు. కేటీఆర్ కుట్రలకు కేంద్రమంత్రి సహకరిస్తున్నారని ఆక్షేపించారు.కేటీఆర్ కుట్రలు చేస్తుంటే.. కిషన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

**కేటీఆర్ చెప్పిందే కిషన్‌రెడ్డి చేస్తున్నారు..**

కిషన్‌రెడ్డికి అంత తెలివిలేదని.. కేటీఆర్ చెప్పిందే చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మెట్రోలో ప్రయాణించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచిస్తున్నారని తెలిపారు. ప్రధాని సూచనలను తాము అమలు చేయాలని చూస్తుంటే.. ఆయన ఎందుకు అడ్డుకుంటున్నారు? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఫేజ్-1ను కేంద్రం స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ఫేజ్-2 నిర్మించుకోవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని వ్యాఖ్యానించారు. అహ్మదాబాద్ మెట్రోకు అనుమతులు, నిధులు వచ్చాయని ప్రస్తావించారు. హైదరాబాద్‌కు మాత్రం అనుమతులు, నిధులు ఎందుకు రావట్లేదని ప్రశ్నించారు. విశాఖపట్నం మెట్రో నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చారని తెలిపారు. తెలంగాణపై కేంద్రానికి ఎంత వివక్ష ఉందో ఈ విషయంలో అర్థమవుతోందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ధాన్యం కొనుగోలులో తెలంగాణపై కేంద్రం వివక్ష: మంత్రి తుమ్మల ధ్వజం



హైదరాబాద్, జూన్ 15 ప్రభాత సూర్యుడు తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. మద్దతు ధర, ధాన్యం కొనుగోళ్ల విషయంలో కేంద్రం వ్యవహరిస్తున్న తీరును ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా.. కేంద్రం నుంచి ఆశించిన స్పందన లభించడం లేదని, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం కేవలం మద్దతు ధరను ప్రకటించి, ఆ తర్వాత కొనుగోళ్ల బాధ్యత నుంచి పూర్తిగా తప్పుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు.కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకే రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, అలా నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నా కూడా ఎందుకు తమపై ఇంత వివక్ష అని మంత్రి తుమ్మల ప్రశ్నించారు. మద్దతు ధర ప్రకటించిన అన్ని రకాల ధాన్యాలనూ సేకరించాల్సిన ప్రాథమిక బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పుకొంటూ, రాష్ట్ర రైతాంగాన్ని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు.

## తెలంగాణ వచ్చినా సింగరేణిలో పరిస్థితి మారలేదు: కవిత



మంచిర్యాల, జూన్ 15 ప్రభాత సూర్యుడు మాజీ మంత్రి హరీశ్ రావుపై తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రూ.40 లక్షల టన్నుల బొగ్గు స్కామ్ జరిగిందని అంటున్నారని, సరైన సమాచారం లేకుండానే కోల్ బెల్ట్‌లో తిరుగుతున్నారంటూ వ్యాఖ్యానించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా హరీశ్ రావు మాయలో పడ్డారన్నారు. హరీశ్‌రావు లేఖ రాయగానే.. కిషన్‌రెడ్డి వెంటనే మరో లేఖ రాశారని తెలిపారు. తెలంగాణలో ఓపెన్ కాస్ట్‌లతో సమానంగా అండర్ గ్రౌండ్స్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత కూడా సింగరేణిలో పరిస్థితి మారలేదని కవిత వ్యాఖ్యానించారు. కార్మికులపై అత్యంత కర్కశంగా యాజమాన్యం వ్యవహరిస్తోందని.. ప్రశ్నించే కార్మికులను అధికారులు వేధిస్తున్నారని ఆరోపించారు. దీనంతటికీ కారణం ప్రభుత్వ అలసత్వమే అని మండిపడ్డారు. ఇటీవల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణిలో పర్యటించారని.. కానీ కార్మికుల సమస్యలను తెలుసుకోలేదన్నారు. భట్టి విక్రమార్క పర్సంటేజ్‌లు తీసుకోవడం మానేయాలని.. ఆ తర్వాతే ప్రతిపక్షాలపై విమర్శలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ 2012లో బొగ్గు స్కామ్ చేసిందని టీఆర్ఎస్ చీఫ్ అన్నారు. అధికారంలోకి వచ్చిన బీజేపీ బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియ చేపట్టిందని తెలిపారు. సింగరేణి కూడా వేలంలో పాల్గొనాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

## తెలంగాణను ఎగుమతి బియ్యం హబ్‌గా తీర్చిదిద్దుతాం: మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్, జూన్ 15 : ప్రభాత సూర్యుడురాష్ట్రంలో 8 మేలురకం వరి వంగడాల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ సమావేశమైంది. ఈ సమావేశానికి మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఎగుమతి రకాల సాగుపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ నిపుణుల కీలక సూచనలు చేశారని తెలిపారు. ఆ 8 రకాల వంగడాలతోనే రైతులకు లాభాలు వస్తాయని వివరించారు.

**విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్..**

విదేశాల్లో తెలంగాణ బియ్యానికి బాగా డిమాండ్ ఉందని భట్టి విక్రమార్క ప్రస్తావించారు. మద్దతు ధర (మీూా) కంటే ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని వెల్లడించారు. దీూ-5204, తెలంగాణ సోనామసూరి సహా ఎగుమతులకు అనుకూలమైన వరి రకాలపై రైతన్నలు దృష్టిపెట్టాలని సూచించారు. మార్కెట్ డిమాండ్ ఉన్న వరి రకాల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆదరణ ఉన్న బియ్యం ఉత్పత్తిని పెంచాలని సూచించారు. రైతుల ఆదాయం పెంచే పంటల సాగును ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో రైతులకు చైతన్య సదస్సులు నిర్వహించాలని సూచించారు. రైతులకు మార్కెట్ ఆధారిత పంటల సాగుపై మార్గనిర్దేశం చేయాలని నిర్ణయించామని అన్నారు. డిమాండ్ లేని వరి రకాల సాగును క్రమంగా తగ్గించాలని చెప్పారు. వినియోగదారులు, మిల్లర్లు కోరుకునే వరి రకాలకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**వానాకాలం సాగుపై ప్రత్యేక కార్యాచరణ..**

ఎగుమతులకు అనుకూలమైన నిర్దిష్ట వరి రకాల సాగు విస్తరణపై దృష్టి పెట్టాలని భట్టి విక్రమార్క మార్గనిర్దేశం చేశారు. వానాకాలం సాగుపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. రైతులకు నష్టాలు రాకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల ప్రణాళిక చేపట్టాలని సూచించారు. నాణ్యమైన బియ్యం ఉత్పత్తి, నిల్వ, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలని నిర్ణయించామని చెప్పారు.

# వరద విపత్తుల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్.



ఖమ్మం, జూన్ 15 ప్రభాత సూర్యుడురానున్న వర్షాకాలంలో వరద నష్ట నివారణకు పటిష్ట కార్యాచరణ చేయాలని, అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరద విపత్తుల నిర్వహణ సన్నద్ధతపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, 2024 లో జిల్లాలో సంభవించిన భారీ వరదలను దృష్టిలో ఉంచుకొని, ముందస్తు సన్నద్ధతపై కార్యాచరణ చేయాలని తెలిపారు. విపత్తుల సమయంలో ముందస్తు సిద్ధతే ప్రాణ నష్టాన్ని తగ్గించే మార్గమని అన్నారు. వరదలు ముందస్తు హెచ్చరికలు లభించే విపత్తులని, సరైన ప్రణాళికతో సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. వరదల సమయంలో ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడమే ముఖ్య బాధ్యత అని అన్నారు. మానవ ప్రాణాలు, పశువుల ప్రాణనష్టం జరగకుండా చూడడం అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పరిస్థితిని ముందుగానే అంచనా వేసి దానికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి ఆధ్వర్యంలో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, అందులో రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, విద్యుత్ శాఖలు కీలకంగా పనిచేయాలని పేర్కొన్నారు. మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమించి నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. 1077 టోల్ ఫ్రీ నంబర్‌ను విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలని సూచించారు. అత్యవసర సమయాల్లో వెంటనే సమాచారాన్ని అందించేందుకు సంబంధిత అధికారుల కాంటాక్ట్ బుక్ సిద్ధంగా ఉండాలని తెలిపారు. నీటి మట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ముంపుకు గురయ్యే గ్రామాలు, ప్రభుత్వ సంస్థలు, సంబంధాలు తెగిపోయే గ్రామాల జాబితా, కూలిపోయే ప్రమాదంలో ఉన్న ఇళ్ల వివరాలు ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. ఎన్ని కుటుంబాలను తరలించాల్సి వస్తుందో, ఎన్ని పునరావాస కేంద్రాలు అవసరమవు తాయో, అందులో అవసరమైన సౌకర్యాలు ఏమిటో అన్న వివరాలతో ముందస్తు నివేదికలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రతి మండలంలో ఎంపీడీవో, ఎంఈఓ, ఎంపీఓ, తహసీల్దార్, పోలీస్ అధికారులు, వైద్య సిబ్బంది, ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ అధికారులు సభ్యులుగా మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా మండలాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. పాత ఇళ్లు కూలిపోవడం వల్ల ప్రాణనష్టం సంభవిస్తున్నందున కూలిపోయే ప్రమాదంలో ఉన్న భవనాలను ముందుగానే గుర్తించి నోటీసులు జారీ చేయాలని సూచించారు. వరద నీరు ప్రవహించే కల్వర్టులు, క్రాస్ రోడ్లు, లోతట్టు రహదారుల వద్ద ప్రజలు దాటేందుకు ప్రయత్నించి ప్రమాదాలకు గురవుతున్నారని, అలాంటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి వరదల సమయంలో పూర్తిగా మూసివేయాలని తెలిపారు. ప్రజలు దాటరాదని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు కాపలా సిబ్బందిని నియమించాలని ఆదేశించారు.

చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రతి మండలంలో భారీ చెట్లను గుర్తించి కొమ్మలు తొలగించే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి మండలంలో వుడ్ కట్టింగ్ యంత్రం అందుబాటులో ఉండాలని తెలిపారు. వర్షాకాలంలో పెచ్చులు ఊడిపోయే ప్రమాదంలో ఉన్న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి ప్రమాదకర గదులను వినియోగించరాదని సూచించారు. ముంపుకు గురయ్యే పాఠశాలల విషయంలో స్థానిక పరిస్థితులను బట్టి సెలవులు మంజూరు చేయాలని తెలిపారు. లోతట్టు, దూర ప్రాంత గ్రామాలు, కట్ ఆఫ్ గ్రామాలను ముందుగానే గుర్తించి అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలు అవసరమయ్యే వారికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, వరదల అనంతరం వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అవసరమైన స్తంభాలు, వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. గత అనుభవాల ఆధారంగా ముంపు గ్రామాలు, ప్రమాద ప్రాంతాలను గుర్తించి సమీపంలోనే పునరావాస కేంద్రాలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. తాళ్లు, టార్చ్‌లైట్లు, బోట్లు వంటి అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ఒక కేంద్రంలో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి మండలంలో మంచి ఈత తెలిసిన వ్యక్తుల జాబితా సిద్ధంగా ఉంచాలని సూచించారు. విపత్తు సమయంలో హీరోలాగా ప్రవర్తించడం ప్రమాదాన్ని పెంచుతుందని, వాలంటీర్లు క్రమశిక్షణతో పనిచేయాలని తెలిపారు. ముందస్తు సిద్ధతతో 99 శాతం ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. వాగులు, చెరువులు, ఎగువ జిల్లాల నీటి మట్టాలు, ట్రిగ్గర్ పాయింట్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వాగులతో అనుసంధానమైన చెరువుల నీటి మట్టాలను కూడా క్రమం తప్పకుండా పరిశీలించాలని తెలిపారు. చెరువు కట్టల్లో బలహీనతలు ఉంటే వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువులకు గండిపడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు ప్రధాన కార్యస్థానంలో అందుబాటులో వుంటూ, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వరదల అనంతరం దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల ముప్పు ఎక్కువగా ఉంటుందని, మున్సిపల్, పంచాయతీ శాఖలు వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని, తాగునీటి లీకేజీలను అరికట్టాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ ఈ సందర్భంగా మండలాలు, మునిసిపాలిటీల వారీగా గత వరదల్లో సంభవించిన నష్టాలు, వాటిని ఎదుర్కొన్న తీరు, రాబోయే వర్షాకాలంలో సన్నద్ధతపై సమీక్షించారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, డిఆర్వో సిహెచ్. రామ్మూర్తి, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, మునిసిపల్ కమిషనర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులను చేర్పించండి.

**మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు.**



సింగరేణి జూన్ 15 ప్రభాత సూర్యుడు.సింగరేణి మండల కేంద్రంలో మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం విద్య వ్యవస్థ పైన ప్రత్యేక దృష్టి పెట్టారని అందులో భాగంగా ప్రభుత్వం ప్రతి విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఏక రూప దుస్తులు, మధ్యాహ్న భోజనం~ా× కంప్యూటర్ ఆధారిత బోధన డిజిటల్ తరగతులు ఉదయం విద్యార్థులకు రాగిజావ ప్రభుత్వం కల్పిస్తుందని అదే విధంగా ప్రభుత్వ పాఠశాల బోధించే ఉపాధ్యాయులు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ చే బోధన కొనసాగుతుందని మండల విద్యాశాఖ అధికారి దుగ్గిరాల జయరాజు తెలిపారు. ప్రాథమిక పాఠశాల విశ్వనాథపల్లి ఉన్నత పాఠశాల విశ్వనాథపల్లి ప్రాథమిక పాఠశాల బొక్కల తండా ప్రాథమిక పాఠశాల కారేపల్లి సందర్శించి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది.

## రైతు సమస్యలపై గ్రీవెన్స్ లో వినతి పత్రం.

సింగరేణి జూన్ 15 ప్రభాత సూర్యుడువ్యవసాయ సీజన్ ఆరంభమవుతున్న



తరుణంలో రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ లో అధికారి మండల తాసిల్దార్ కు వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జ రామారావు మాట్లాడితే రైతులకు నాణ్యమైన విత్తనాలు ప్రత్తి,మిర్చి,వరి మరియు ఇతర విత్తనాలు నాణ్యమైనవి సబ్సిడీ ధరలకు సరఫరా చేయాలని, ప్రభుత్వం కొనుగోలు చేసిన మొక్కజొన్న, వరి ధాన్యానికి సంబంధించిన డబ్బులు వెంటనే విడుదల చేయాలని, పెండింగ్ లో ఉన్న రైతు భరోసానిధులు వెంటనే విడుదల చేసి పంట సాయానికి ఉపయోగపడాలని, ఖరీఫ్ సీజన్లో రైతు భరోసా సహాయం అందించాలని, యూరియా కొరతను నివారించే విధంగా చర్యలు తీసుకోవాలని యాప్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని, పెరిగిన ఎరువుల ధరలను తగ్గించాలని, కుంటలు చెరువుల కింద ఉన్న పంట కాలవలను మరమ్మతులు చేయాలని మంచి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు ముండ్ల ఏకాంబరం, సీనియర్ నాయకులు తలారి దేవప్రకాష్, సిఐటియు మండల కన్వీనర్ కే నరేంద్ర, వాసం భాస్కర్, మధుర కోల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తోటకూరి రాంబాబు ఆధ్వర్యంలో ఉపముఖ్యమంత్రి జన్మదిన వేడుక.

**పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు**

సింగరేణి జూన్ 15 ప్రభాత సూర్యుడు.సింగరేణి మండల కేంద్రంలో



సోమవారం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు నూతనంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నికైన తోటకూర రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, సర్పంచ్ల సంఘం అధ్యక్షులు రంజిత్ కుమార్,గ్రామ సర్పంచ్ టోనీ, సొసైటీ డైరెక్టర్ అడ్డగోడ ఐలయ్య, సర్పంచ్ మాత్రు నాయక్, సర్పంచ్ హీరాలాల్, శంకర్, విష్ణువర్ధన్ రెడ్డి, ఉమా శంకర్, షఫీ, యాకూబ్, రాములు తదితరులు పాల్గొన్నారువరద నష్ట నివారణకు పటిష్ట కార్యచరణ.. జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్.

## స్టాప్ డయేరియా, పల్స్ పోలియో, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌పై జిల్లా టాస్క్ ఫోర్స్ సమీక్ష

రంగారెడ్డి జిల్లా -- ప్రభాత సూర్యుడు: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశంలో స్టాప్ డయేరియా క్యాంపెయిన్, పల్స్ పోలియో, జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (ఎన్‌డీడీ), హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (ఐవీడఎూ) డాక్టర్ స్వర్ణకుమారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యక్రమాల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ కె. చంద్రారెడ్డి




మాట్లాడుతూ, స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌ను జూన్ 1 నుంచి 15 వరకు సన్నాహక దశగా, జూన్ 16 నుంచి జూలై 31 వరకు అమలు దశగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డయేరియా నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య సంస్థల్లో ఓఆర్‌ఎస్ కార్నర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని, జిల్లాలోని ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. జూలై 13న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రైవేట్ విద్యాసంస్థల ద్వారా డీ-వార్మింగ్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మొదటి విడతలో మాత్రలు తీసుకోలేని పిల్లలకు జూలై 20న మాప్-అప్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా, 14 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించనున్నట్లు తెలిపారు. విద్యార్థినులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో అవగాహన పెంచి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, వైద్య మరియు ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కేజీబీవీ బాలికల మధ్య డిప్యూటీ సీఎం భట్టి బర్త్‌డే వేడుకలు

మొయినాబాద్ -- ప్రభాత సూర్యుడు:తెలంగాణ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తన జన్మదిన వేడుకలను రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినుల మధ్య నిరాడంబరంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి విద్యార్థినులతో కూర్చొని భోజనం చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 29 లక్షల మంది ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం నుంచే అల్పాహార పథకాన్ని



అమలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అందిస్తున్నామని చెప్పారు. విద్యార్థుల విద్య, ఆరోగ్యం కోసం ప్రభుత్వం అవసరమైన నిధులు వెచ్చించేందుకు వెనుకాడదని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పేద బాలికల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం భట్టి విక్రమార్క నిరాడంబరతకు నిదర్శనమని కొనియాడారు. గతంలో పెండింగ్‌లో ఉన్న డైట్, కాస్మోటిక్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకుడు భీమ్ భరత్ ఆధ్వర్యంలో భట్టి విక్రమార్కతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలే యాదయ్య, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## గ్రావెల్ రోడ్డు నిర్మాణం పనులు పరిశీలించిన సర్పంచ్ హేమలత.



సింగరేణి జూన్ 15 ప్రభాత సూర్యుడుసింగరేణి మండల పరిధిలో పొలంపల్లి, భాగ్యనగర్ గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు చాలా కాలంగా రవాణా సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో నాగయ్య గుంపు నుండి కోటిలింగాల వరకు ఉన్న మట్టి రహదారి బురదమయంగా మారి రైతులు తమ పంటలను తరలించుకోవడం, వ్యవసాయ పనుల కోసం రాకపోకలు సాగించడం ఎంతో కష్టసాధ్యమయ్యేది. ఈ సమస్యను గుర్తించిన స్థానిక రైతులు వైరా నియోజకవర్గ శాసన సభ్యులు రాందాస్ నాయక్ కి వినతిపత్రం సమర్పించారు.రైతుల సమస్యలను సానుకూలంగా స్వీకరించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో, వినతిపత్రం అందించిన వారం రోజుల వ్యవధిలోనే పొలంపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ మరియు ఖమ్మం జిల్లా దిశ కమిటీ సభ్యులు హేమలత చొరవ తీసుకొని పాలకవర్గ సభ్యుల సహకారంతో నాగయ్య గుంపు నుండి కోటిలింగాల వరకు గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణంతో రైతులకు ఎంతో ఉపశమనం లభించింది. వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించడం, ఎరువులు, విత్తనాలు ఇతర వ్యవసాయ సామగ్రిని పొలాలకు చేర్చడం సులభతరమైంది. అదేవిధంగా గ్రామ ప్రజల రాకపోకలు కూడా సౌకర్యవంతంగా మారాయి. గతంలో వర్షాకాలంలో నడవడానికి కూడా ఇబ్బందిగా ఉన్న ఈ మార్గం ఇప్పుడు సురక్షితమైన రవాణా సదుపాయంగా మారింది.గ్రామ పంచాయతీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండటమే కాకుండా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కొత్త దిశను చూపుతున్నాయి. ఇప్పటి వరకు కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన పొలంపల్లి గ్రామ పంచాయతీ, గ్రామ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఇప్పటికే పూర్తయిన ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి పనులే గ్రామ పంచాయతీ చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఈ గ్రావెల్ రోడ్డు నిర్మాణం రైతుల కలలను సాకారం చేయడమే కాకుండా గ్రామీణాభివృద్ధిలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. గ్రామ ప్రజలు, రైతులు సర్పంచ్ శ్రేమలత, పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# పేద ప్రజల ఆరోగ్య భద్రతకు అండగా.. ఎమ్మెల్సీ. అంజిరెడ్డి



జూన్ (15)ప్రభాత సూర్యుడుసంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం, గుంతపల్లి గ్రామానికి చెందిన పట్లోళ్ల హన్మంత్ రెడ్డి తీవ్ర గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతూ, హైదరాబాద్ నిమ్స్ (NIMS) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు అత్యంత ఖరీదైన వైద్య చికిత్స అవసరం కాగా, ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితిని చూసి భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకుడు మరియు ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి తక్షణమే స్పందించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సీఎం సహాయ నిధి (CMRF) ద్వారా రూ. 6,50,000/- (ఆరు లక్షల యాభై వేల రూపాయలు) విలువైన ఎ.ల్.ఓ.సీను మంజూరు చేయించి ఆ కుటుంబానికి కొండంత అండగా నిలిచారు. ?ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకోవడంలో ఎమ్మెల్సీ ఎల్లప్పుడూ ముందుంటారని మరోసారి నిరూపితమైంది.

# అన్నారం శ్రీ సుందర రామచంద్రస్వామి వారి మండల ఉత్సవ ఆహ్వాన పత్రిక

జూన్ (15)ప్రభాత సూర్యుడు గుమ్మడిదల మున్సిపాలిటీ అన్నారంలో శ్రీ సుందర రామచంద్ర స్వామి వారి మండల ఉత్సవ ఆహ్వాన పత్రికను రామాలయ ఉత్సవ కమిటీ పురోహితులు శ్రీమాన్ చక్రపాణిపాపాచారి గారి ఆధ్వర్యంలో సోమవారం నాడు ఆవిష్కరించడం జరిగింది! కావున శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి దివ్య మంగళ శాసనములతో యోగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము కావున నియోజకవర్గంలోని, మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు భక్తులు సకాలంలో విచ్చేసి స్వామివారికి ప్రసాదాలు స్వీకరించగలరని కోరడమైనది కార్యక్రమాల వివరాలు 17-06-2026 బుధవారం నాడు విశ్వక్సేనారాధన 07:45 ఉదయం పుణ్యాహవాచనం అష్టోత్తర కలశ స్థాపన మూల్యామంత్ర హవనం, మహా పూర్ణహుతి అభిషేకం అలంకరణ తీర్థ ప్రసాద గోష్టి మహాదాసుర్వాదనం భక్తులు తీసుకొని వెళ్లగలరని అన్నారం మున్సిపాలిటీ అందరు రామచంద్రమూర్తి ఆలయ కమిటీ తెలిపింది.




# బీఆర్ఎస్ బలోపేతానికి సభ్యత్వ నమోదు కీలకం: మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

మణుగూరు, జూన్ 15 ప్రభాత సూర్యుడుపార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుఅన్నారు.

సోమవారం మణుగూరు మండలంహనుమాన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు, ముఖ్య కార్యకర్తల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని,
అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయాలని పిలుపునిచ్చారు.బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి పార్టీ పట్ల విశ్వాసాన్ని మరింత పెంచాలని సూచించారు. పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని కోరారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు

**సత్వర చర్యలు తీసుకుని ప్రజల సమస్యలను పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి**



మేడ్చల్ మల్కాజ్గిరి, కలెక్టరేట్ప్రభాత సూర్యుడుప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు వెంటనే పంపించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్--మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) మాలతితో కలిసి మొత్తం 95 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే విశ్వాసంతో సమయం, ధనం వెచ్చించి ప్రజావాణికి వస్తున్నారని పేర్కొన్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందన్నారు. అందువల్ల ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని ప్రాధాన్యతతో పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే, తిరస్కరించాల్సిన దరఖాస్తుల విషయంలో తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా, వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సంబంధిత శాఖల అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# విద్య, వైద్యం రంగాలకు సీఎస్ఆర్ నిధుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలి - జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం జూన్ 16 (ప్రభాత సూర్యుడు )జిల్లాలో విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల్లో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు.



సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని సింగరేణి, కేటీపీఎస్, నవభారత్, ఐటీసీ తదితర పరిశ్రమల ప్రతినిధులతో సీఎస్ఆర్ నిధుల ద్వారా అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టాల్సిన కొత్త పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు పాఠశాలల్లో తరగతి గదుల అభివృద్ధి, ఫర్నిచర్, తాగునీటి సదుపాయాలు, పారిశుద్ధ్య వసతులు, డిజిటల్ విద్యా సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలకు సీఎస్ఆర్ నిధులను వినియోగించాలని కోరారు.ప్రభుత్వ ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పరికరాలు, మౌలిక వసతులు, రోగుల సౌకర్యాల కల్పనకు పరిశ్రమలు సహకరించాలని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవల విస్తరణకు అవసరమైన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అందుతున్న వినతులు, ఫిర్యాదులు, స్థానిక అవసరాల ఆధారంగా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సీఎస్ఆర్ నిధులను వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరే పనులను ఎంపిక చేసి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ వేగవంతంగా అమలు చేయాలని చెప్పారు.గిరిజన, గుత్తికోయ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీటి సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించిన కలెక్టర్, జిల్లాలోని అన్ని పరిశ్రమలు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. సీఎస్ఆర్ నిధుల వినియోగం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయాలని అన్నారు.సమావేశంలో పరిశ్రమల ప్రతినిధులు తమ సంస్థల ద్వారా ఇప్పటివరకు చేపట్టిన సీఎస్ఆర్ కార్యక్రమాల వివరాలను వెల్లడించగా, భవిష్యత్తులో చేపట్టనున్న పనులపై చర్చించారు.సంబంధిత శాఖల అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

# మల్లారం కాలనీకి మౌలిక వసతులు ఎప్పుడు?

**ఖాళీ ఇళ్ల స్థలాలను ఇల్లు లేని వారికి కేటాయిస్తామంటున్న మాస్ లైన్ పార్టీ నాయకులు పండూరి వీరబాబు.**

జూన్16 ప్రభాత సూర్యుడుఅశ్వారావుపేట నియోజకవర్గం దమ్మపేట మండల కేంద్రంలోని మల్లారం కాలనీ ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా, ఇప్పటికీ కనీస మౌలిక వసతులు అందక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సరైన డ్రైనేజీ వ్యవస్థ మరియు కొన్ని వీధులకు సరైన సిసి రోడ్లు కూడా లేవు గత బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో శాంక్షన్ అయ్యా రోడ్లు కూడా ఇప్పటికీ రోడ్లు వేయకుండా వదిలేశారు, కనీసం కొన్ని బజారులకు అయితే మనుషులు నడిచే దారి కూడా లేకుండా పెరిగిన మొక్కలే అడ్డుగా ఉన్నాయి, వాటిని శుభ్రం చేసే నాధుడే లేడు అదేవిధంగా కాలనీలో ప్రభుత్వం కేటాయించిన ఇల్లు కనీసం పునాదివేసి వదిలేసిన ఇల్లులు చాలా ఉన్నాయి, వాటి మీద పెరిగిన చెత్తను కూడా శుభ్రం చేసే వాళ్ళు ఎవరూ లేరు వెంటనే ఆ చెత్తను శుభ్రం చేసి ఎవరి స్థలాలను వాళ్ళు బాగు చేసుకోవాలి, లేని పక్షంలో పార్టీ తరపున ఆ ఇళ్ల స్థలాలను ఇల్లు లేని వారికి కేటాయిస్తామని హెచ్చరిస్తున్నాం.మరోవైపు ఎండాకాలం ముగిసి వర్షాకాలం వస్తుందంటే కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ఎత్తైన ప్రాంతంలో ఉన్న మల్లారం కాలనీ నుంచి వర్షపు నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండగా, సరైన డ్రైనేజీ లేకపోవడంతో నీరు ఇళ్లలోకి చేరి ప్రతి సంవత్సరం భారీ నష్టాన్ని కలిగిస్తోందని చెబుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి ఇళ్లలోకి నీరు చేరి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ప్రభుత్వం కేటాయించిన అనేక స్థలాలు ఇప్పటికీ ఖాళీగానే ఉండిపోవడంతో వాటి చుట్టూ పిచ్చిమొక్కలు విస్తరించాయి. ఈ కారణంగా దోమల బెడదతో పాటు పాములు సంచరిస్తున్నాయని, చిన్నారులు ఉన్న కుటుంబాలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఖాళీ స్థలాల నిర్వహణపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యలపై ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేకపోయిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# సంగారెడ్డి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: అవధూత గిరి



జూన్(15) ప్రభాత సూర్యుడు: భూమాత మనందరికీ తల్లితో సమానం మని భూమిని ప్రేమించడం ప్రతి మనిషి ధర్మం అని బర్ధిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి అన్నారు!! సోమవారం అమావాస్య సందర్భంగా ఆశ్రమంలో రుద్ర యజ్ఞం, నారాయణ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమం మాతృమూర్తులు ఆనందగిరి, నందిని మాటలు చేపట్టిన 16 వారాల వ్రతం వైభవంగా ముగిసినట్లు ఆయన తెలిపారు.

# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడికి సన్మానం.



సింగరేణి జూన్ 15 ప్రభాత సూర్యుడుసింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించబడిన తోటకూరి రాంబాబును ఆ పార్టీ నాయకులు సోమవారం సన్మానించారు. కారేపల్లి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాంబాబుకు చాలా కప్పి సన్మానించారు. అనంతరం అధ్యక్షులు రాంబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. బర్త్డే కేకు కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు బానోత్ రామ్మూర్తి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు రంజిత్ కుమార్, సర్పంచ్ లు మేదరి వీర ప్రతాప్(టోని), భానోత్ హీరాలాల్, ఇస్లావత్ రాజు, వాంకుడోత్ హన్మంతరావు, భూక్య బాలు, ఈసం మోతీరస్వామి, ఉండం రాఘవులు, బానోత్ పద్మ వీరభద్రం, కాంగ్రెస్ నాయకులు అడ్డగోడ ఐలయ్య, సూరపురెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, సురేందర్ మనియార్, ఎండీ. యాకూబ్ అలీ , బోళ్ల రమేష్, షఫీ, పిట్టల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గుమ్మడిదల: ప్రభుత్వ పాఠశాలలో మీ పిల్లలను చేర్పించండి

జూన్ 15 ప్రభాత సూర్యుడుగుమ్మడిదల మండలం కానుగుంట గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి మొదటి తరగతి విద్యప్రవేశాలు కొనసాగుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు,యూనిఫామ్ లు, మధ్యాహ్న భోజనాలు వంటి సౌకర్యాలు వినియోగించుకోవాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



# సంగారెడ్డి: బాధితులకు సత్వర న్యాయం అందించడమే లక్ష్యం:



ఎస్పి జూన్ (15) ప్రభాత సూర్యుడు: స్థానిక పోలీస్ స్టేషన్లో సమస్యలు పరిష్కారం కానప్పుడు ప్రజలు ఏలాంటి భయాందోళనలు లేకుండా నేరుగా ప్రజావాణిని వినియోగించుకోవాలని సంగారెడ్డి జిల్లా స్థానిక సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ సూచించారు! సోమవారం ఆయన ప్రజావాణిలో ప్రజలు నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరుగా అధికారులను సంప్రదించాలన్నారు. ప్రజావాణి వద్ద వచ్చే ఫిర్యాదులను జిల్లా కార్యాలయం నుండి నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు






## వ్వాటే పంచ్:
## సమంత చేసిన పూరీలు ఎలా ఉంటాయో చెప్పిన భర్త!



దశాబ్దాల పాటు తనదైన ప్రత్యేకమైన యాంకరింగ్ శైలితో.. అద్భుతమైన టైమింగ్‌తో సీనియర్ యాంకర్ సుమ కనకాల తెలుగు ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. దశాబ్దాల పాటు తనదైన ప్రత్యేకమైన యాంకరింగ్ శైలితో.. అద్భుతమైన టైమింగ్‌తో సీనియర్ యాంకర్ సుమ కనకాల తెలుగు ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నారు. బుల్లితెరపై ఈ సీనియర్ యాంకర్ సందడి ఎప్పటికీ అల్టిమేట్. ఇప్పుడు సుమ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న -సుమ అండ్ చాట్ షో- సరికొత్త ఇంటర్వ్యూలతో మరోసారి అభిమానుల ముందుకు వచ్చింది. తాజాగా ఈ షోకి -మా ఇంటి బంగారం- చిత్ర బృందం విచ్చేసింది. ఈ కార్యక్రమంలో చిత్ర దర్శకురాలు నందిని రెడ్డితో పాటు అన్యోన్య దంపతులు సమంత, రాజ్ పాల్గొని సందడి చేశారు. సుమ మార్క్ పంచ్‌లు...బంగారం టీమ్ కాంబినేషన్‌తో ఈ ఎపిసోడ్ అంతా నవ్వుల పువ్వులు పూయించింది. ఈ ఇంటర్వ్యూలో భాగంగా సుమ అడిగిన ఆసక్తికరమైన ప్రశ్నలు, దానికి సమంత-రాజ్ జంట ఇచ్చిన సమాధానాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. --సమంత వర్సెస్ రాజ్ : ఎవరు ఉత్తమమో ఎవరికి తెలుసు?-- అనే టాస్క్‌లో భాగంగా సుమ వీరిద్దరితో పాటలు పాడించారు. అలాగే టెన్త్ క్లాస్‌లో 80 శాతం కంటే ఎక్కువ మార్కులు ఎవరికి వచ్చాయి? అని సుమ ప్రశ్నించగా.. సమంత ఏమాత్రం ఆలోచించకుండా రాజ్ వైపు చూపించారు. ఇక ఏదైనా ఎమోషనల్ సీన్ చూస్తే త్వరగా ఎవరు కనెక్ట్ అయి ఏడుస్తారు? అని అడగగా.. రాజ్ వెంటనే -సమంత- వైపే చూపించారు. తాను ఏ ఏ సందర్భాల్లో అంతగా ఎమోషనల్ అవుతుందో సమంత కూడా ఈ షోలో ఓపెన్‌గా వెల్లడించారు. ఇక ఈ ఇంటర్వ్యూలో ఒక టాప్ హైలైట్ సీన్ ఏమిటంటే.. --ఏదైనా ఒక మంచి జోక్ చెప్పండి-- అని సుమ రాజ్‌ను కోరగా.. అతడు ఏమాత్రం తడుముకోకుండా -సమంత చేసిన పూరీలు చాలా బావుంటాయి- అంటూ భార్య వంట గది నైపుణ్యంపై సెటైర్ వేశాడు. రాజ్ వేసిన ఈ కౌంటర్‌తో సమంతతో పాటు యాంకర్ సుమ, దర్శకురాలు నందిని రెడ్డి కూడా నవ్వులు ఆపుకోలేకపోయారు. ఇలా ఎంతో సరదాగా, హుషారుగా సాగిన ఈ ఫుల్ ఎపిసోడ్‌ను --సుమ ఒ చాట్ షో- యూట్యూబ్ ఛానెల్స్‌లో వీక్షించవచ్చు. -మా ఇంటి బంగారం- విశేషాలు ప్రస్తుతం టాలీవుడ్‌లో -మా ఇంటి బంగారం- సినిమాకు సంబంధించిన టీజర్, పోస్టర్లు, సింగిల్స్ ఇలా ప్రతి ఒక్క ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో సమంత ప్రధాన పాత్రలో నటిస్తుండగా తన భర్తగా రాజ్ స్క్రిప్టు పరంగా ప్రొడక్షన్ పరంగా సహకారం అందించారు.

## రావిపూడి కొత్త టైటిల్..
## ఈసారి ఇంకెలా సర్ప్రైజ్ చేస్తారో..

టాలీవుడ్ లో సినిమా ప్రమోషన్స్ అంటే పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్లు అనేవి కామన్. కానీ దర్శకుడు అనిల్ రావిపూడి మాత్రం ఆ పద్ధతికి భిన్నంగా ఆలోచిస్తుంటారు. టాలీవుడ్ లో సినిమా ప్రమోషన్స్ అంటే పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్లు అనేవి కామన్. కానీ దర్శకుడు అనిల్ రావిపూడి మాత్రం ఆ పద్ధతికి భిన్నంగా ఆలోచిస్తుంటారు. సినిమా సెట్స్ పైకి వెళ్లకముందే ప్రేక్షకుల్లో చర్చ మొదలయ్యేలా చేయడం ఆయన స్పెషాలిటీ. ఇప్పుడు విక్టరీ



వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ కాంబినేషన్ లో రూపొందుతున్న కొత్త మల్టీస్టారర్ విషయంలో కూడా అదే ప్లాన్ ఫాలో అవుతున్నారు. విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న ఆ చిత్రం జూన్ 18న పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానుంది. అనంతరం జూన్ 22 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు మూవీ టీమ్ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సమాచారం. ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఆ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ప్రస్తుతం ఎక్కువగా చర్చకు వస్తున్న అంశం టైటిల్. ఆ చిత్రానికి 'జనవరి 13 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్ ఖరారైందంటూ కొద్ది రోజులుగా వార్తలు వినిపిస్తున్నాయి. కానీ తాజా సమాచారం ప్రకారం అదే టైటిల్ ను నేరుగా ప్రకటించకుండా, ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే స్పెషల్ ప్లాన్ తో రివీల్ చేయాలని అనిల్ రావిపూడి భావిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో అసలు టైటిల్ అదేనా? లేక మరో సర్ప్రైజ్ దాగి ఉందా? అనే ఆసక్తి మరింత పెరిగింది సాధారణంగా సినిమా ప్రారంభమైన తర్వాత ప్రమోషన్స్ మొదలవుతాయి. కానీ అనిల్ రావిపూడి మాత్రం షూటింగ్ కు ముందే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ పెంచుతున్నారు. ఇటీవల సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్, రైటర్ అనంత శ్రీరామ్ లతో రూపొందించిన ఫన్నీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విశాఖ బీచ్ ఇసుకలో వారిని మెడ వరకు కప్పేసి, జంధ్యాల మార్క్ కామెడీ గుర్తు చేసేలా రూపొందించిన ఆ వీడియో ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇది అనిల్ రావిపూడికి కొత్తేమీ కాదు. గతంలో ప్రమోషన్స్ కు దూరంగా ఉండే నయనతారతో ప్రత్యేక వీడియో చేయించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సినిమా విడుదలకు ముందే చర్చలోకి తీసుకురావడం, సోషల్ మీడియాలో వైరల్ అయ్యేలా కంటెంట్ ప్లాన్ చేయడం ఆయనకు అలవాటుగా మారిపోయింది. అందుకే ప్రమోషన్స్‌లో అనిల్ రావిపూడిని మించిన వారు లేరంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. ఇక ఆ చిత్రంలో కళ్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి నటించనున్నట్లు ప్రచారం జరుగుతుండగా, వెంకటేష్ జోడీగా కీర్తి సురేష్ కనిపించే అవకాశాలు ఉన్నాయి. షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఆ చిత్రానికి సురేష్ బాబు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో భారీ స్థాయిలో సినిమా తెరకెక్కనుంది. సంక్రాంతి సీజన్ అనిల్ రావిపూడికి కలిసొచ్చింది. వెంకటేష్ తో ఆయన కాంబినేషన్ ఇప్పటికే సక్సెస్ అయింది. ఇప్పుడు కళ్యాణ్ రామ్ చేరడంతో ఆ మల్టీస్టారర్ పై అంచనాలు మరింత పెరిగాయి. అయితే అందరి దృష్టి మాత్రం ఒకే విషయంపై నిలిచింది. ఇప్పటికే ప్రచారంలో ఉన్న టైటిల్ నే ప్రకటిస్తారా? లేక అనిల్ రావిపూడి మార్క్ లో మరో కొత్త సర్ప్రైజ్ ఇస్తారా? అన్నది తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

## కమల్ డిజాస్టర్ 'థగ్ లైఫ్' వెనుక అంత కథ ఉందా?



భారతీయ సినీరంగంలోనే అత్యుత్తమ నటులలో ఒకరిగా.. అద్భుతమైన దార్శనికత కలిగిన దర్శకుడిగా ఉలగనాయగన్ కమల్ హాసన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. భారతీయ సినీరంగంలోనే అత్యుత్తమ నటులలో ఒకరిగా.. అద్భుతమైన దార్శనికత కలిగిన దర్శకుడిగా ఉలగనాయగన్ కమల్ హాసన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన ఒక సినిమాలో నటిస్తున్నానని ప్రకటిస్తేనే అంచనాలు ఆకాశాన్ని తాకుతాయి. అయితే కమల్ హాసన్ కెరీర్‌లో అతడు నటించి నిర్మించిన సినిమాలతో పాటు, పట్టాలెక్కకుండా ఆగిపోయిన లేదా అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రాజెక్ట్‌ల గురించి కూడా సినీ వర్గాల్లో అంతే ఆసక్తికరంగా చర్చ జరుగుతుంటుంది. ఎన్నో ప్రతిష్టాత్మకమైన ఆలోచనలతో ఆయన ప్రారంభించాలనుకున్న కొన్ని డ్రీమ్ ప్రాజెక్టులు..రకరకాల కారణాలతో కార్యరూపం దాల్చకుండానే నిలిచిపోయాయి. అలా కమల్ హాసన్ మనసులో చాలా కాలంగా ఉండిపోయిన ఒక బలమైన కథాంశం ఆధారంగా రూపుదిద్దుకున్న చిత్రమే -థగ్ లైఫ్-. ఫలితం నిరాశపరిచినా కానీ, ఈ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు ఆయన గత కొన్నేళ్లుగా ఎన్నో ప్రయత్నాలు చేసిన విషయం అందరికీ తెలియకపోవచ్చు. థగ్ లైఫ్ ప్రయత్నాలకు ప్రతిసారీ ఏదో ఒక అడ్డంకి ఎదురవుతూనే వచ్చింది. చివరకు తన మనసులోని ఆ కోర్ పాయింట్‌ను (కథాంశాన్ని) తన ప్రాణస్నేహితుడు, దిగ్గజ దర్శకుడు మణిరత్నానికి కమల్ అప్పగించారు. అలా వీరిద్దరి కలయికలో ఈ చిత్రం తెరకెక్కింది. అయితే థియేటర్లలో భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దారుణమైన పరాజయాన్ని చవిచూడటం తెలిసిందే. ఈ కథ మూలాలు -తలైవన్ ఇరుక్కిరాన్- అనే టైటిల్‌తో 2000వ దశకం చివరలోనే ప్రారంభమయ్యాయి. అప్పట్లో ఈ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంలో బాలీవుడ్ దిగ్గజం రిషి కపూర్, టాలీవుడ్ సీనియర్ హీరో వెంకటేష్, మాలీవుడ్ సూపర్ స్టార్ మోహన్‌లాల్ వంటి భారీ తారాగణాన్ని ఎంపిక చేయాలని కమల్ భావించారు. కానీ ఆ సమయంలో ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదు. దీంతో మోహన్‌లాల్, వెంకటేష్ ఇచ్చిన డేట్స్‌ను వాడుకుని కమల్ హాసన్ చక్రి తోలేటి దర్శకత్వంలో -ఉన్నైపోల్ ఒరువన్- (తెలుగులో -ఈనాడు-) అనే సినిమాను నిర్మించారు. ఆ తర్వాత కూడా కమల్ ఈ ప్రాజెక్ట్‌ను వదిలిపెట్టలేదు. 2012లో ప్రముఖ నిర్మాత ఆస్కార్ రవిచంద్రన్ నిర్మాణంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్ కథానాయికగా ఈ సినిమాను రీలాంచ్ చేయాలని చూసినా అది కుదరలేదు. ఒక దశలో ఈ చిత్రానికి కమల్ హాసనే స్వయంగా దర్శకత్వం వహిస్తారనే ప్రచారం కూడా జరిగింది. అనంతరం 2015లో ఈ ప్రాజెక్ట్ మరోసారి వార్తల్లోకి వచ్చింది. ఈసారి దీనిని -తలైవన్ ఇరుక్కిరాన్- పేరుతో తమిళంలో -అమర్ హై- పేరుతో హిందీలో ద్విభాషా చిత్రంగా తెరకెక్కించాలని ప్లాన్ చేశారు. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో నటించేందుకు కూడా అంగీకరించారు. కమల్ హాసన్ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడిస్తూ ప్రాజెక్ట్ త్వరలోనే పట్టాలెక్కబోతోందని ప్రకటించారు. అయితే ఒరిజినల్ కథనే మార్చారా లేదా సరికొత్తగా రాసుకున్నారా అనేది స్పష్టం కాకముందే ఈ ప్రయత్నం కూడా కార్యరూపం దాల్చలేదు. ఇలా ఎన్నో పరిణామాల మధ్య నలిగిన కమల్ హాసన్ కలల ప్రాజెక్ట్.. చివరకు మణిరత్నం చేతుల్లోకి వెళ్లి -థగ్ లైఫ్- రూపంలో ప్రేక్షకుల ముందుకు వచ్చినా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేకపోయింది. ఈ సినిమా డిజాస్టర్ అయిందని మాత్రమే ప్రజలకు తెలుసు కానీ, దీనివెనక కమల్ హాసన్ దశాబ్దాల చెరగని కల ఉందని ఎవరికీ తెలీదు. అయితే ఈ ప్రాజెక్టును మణిరత్నానికి ఇవ్వకుండా తనే స్వయంగా డైరెక్ట్ చేసి ఉంటే ఫలితం వేరొకలా ఉండేదేమో!

## కలెక్షన్స్ :
## 'పెద్ది' సెకండ్ సండే కలెక్షన్స్ !




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ 'పెద్ది' సినిమా.. ప్రపంచవ్యాప్తంగా విడుదలై 11 రోజులు అయ్యింది. ఐతే, ఈ చిత్రం విడుదలైన రెండవ ఆదివారం నాడు టిక్కెట్ల అమ్మకాలలో భారీగా పెరుగుదలను చూసింది. బుక్‌మైషోలో 160ఖకు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. ఈ సంఖ్య శనివారం నాటి 155ఖ టిక్కెట్ల కంటే ఐదు శాతం ఎక్కువ. కాకపోతే, ఇప్పుడు అందరి దృష్టి సోమవారంపైనే ఉంది. మరి ఈ రోజు కలెక్షన్స్ ఎలా ఉంటాయో చూడాలి. మొత్తానికి ప్రేక్షకులతో పాటు ఇటు అభిమానుల నుంచి కూడా పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. బాక్సాఫీస్ వద్ద పెద్ది తన స్థిరమైన, ఆకట్టుకునే రన్ ను కొనసాగిస్తోంది. నిజానికి కొంత ప్రతికూలతను ఎదుర్కొన్నప్పటికీ, పెద్ది తన రెండో వారంలో కూడా బలమైన ఊపును కొనసాగిస్తోంది. ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ సంస్థ రూ. 350 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మించింది. వెంకట సతీష్ కిలారు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ భారీ యాక్షన్ ఎమోషనల్ డ్రామాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించింది. మొత్తానికి పెద్ది మంచి విజయాన్ని అందుకుంది.

## 'వారణాసి'
## క్లైమాక్స్ కోసం భారీగా కసరత్తులు !

దర్శకధీరుడు రాజమౌళి -- మహేష్ బాబు కలయికలో రాబోతున్న సినిమా 'వారణాసి'. కాగా తాజాగా ఈ చిత్ర యూనిట్ క్లైమాక్స్ షూట్ కి సన్నాహాలు చేసుకుంటోంది. నాలుగు కోట్ల రూపాయల భారీ సెట్‌లో ఈ సినిమా క్లైమాక్స్




యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తారట. మహేష్ అభిమానులకు ఈ యాక్షన్ సీక్వెన్స్ కనుల విందుగా ఉంటుందని టాక్. ప్రియాంక ఈ సినిమాలో మందాకినిగా కనిపిస్తూ ఉండగా.. మహేశ్ రుద్రగా.. శ్రీరాముడిగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. అన్నట్టు 'వారణాసి' చిత్రం రూ.1300 కోట్లకు పైగా భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతోంది. కాగా ఈ భారీ ప్రాజెక్ట్‌ను కెఎల్ నారాయణ,
ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు దేశవ్యాప్తంగా మంచి స్పందన లభించింది. ఈ చిత్రానికి సంగీతాన్ని ఎంఎం కీరవాణి అందిస్తుండగా, కథా కథనాన్ని విజయేంద్ర ప్రసాద్ రూపొందించారు. ఇక ఈ సినిమాకి దేవా కట్టా సంభాషణలు అందిస్తున్నారు. ఈ సినిమాను పూర్తిగా IMAX ఫార్మాట్లో చిత్రీకరిస్తుండగా, పలు భాషల్లో విడుదల చేయనున్నారు.

## ఒకే ఫ్రేమ్‌లో రజనీ - కమల్ హాసన్‌ని గురువు బాలచందర్ వీక్షిస్తే!

భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక మల్టీస్టారర్ చిత్రం త్వరలోనే పట్టాలెక్కబోతోంది. భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక మల్టీస్టారర్ చిత్రం త్వరలోనే పట్టాలెక్కబోతోంది. తమిళ చిత్ర పరిశ్రమకు రెండు కళ్లుగా భావించే లెజెండరీ నటులు సూపర్ స్టార్ రజనీకాంత్, ఉలగనాయగన్ కమల్ హాసన్ దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత మళ్లీ కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతున్నారు. ఈ సంచలన ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను రజనీకాంత్ భార్య లతా రజనీకాంత్ అధికారికంగా ధృవీకరించారు. ప్రముఖ జాతీయ మీడియాతో లతాజీ ప్రత్యేకంగా మాట్లాడుతూ.. ఈ సినిమా షూటింగ్ చాలా త్వరలోనే ప్రారంభం కానుందని స్పష్టం చేశారు. ఈ అరుదైన కలయిక కేవలం అభిమానులకే కాకుండా.. మొత్తం భారతీయ చిత్ర పరిశ్రమకే ఒక చారిత్రాత్మక మైలురాయి కాబోతోందని లతా రజనీకాంత్ అభివర్ణించారు. రజనీకాంత్, కమల్ హాసన్ తమ కెరీర్ ప్రారంభంలో లెజెండరీ దర్శకుడు కె. బాలచందర్ సారథ్యంలో కలిసి నటించారు. ఆ తర్వాత తమకంటూ ప్రత్యేక శైలిని ఏర్పరచుకుని సూపర్ స్టార్లుగా ఎదిగారు. వీరిద్దరి మధ్య ఉన్నది కేవలం వృత్తిపరమైన పోటీ మాత్రమే కాదు.. అంతకుమించిన గొప్ప స్నేహానుబంధం అని ఆమె గుర్తుచేశారు. ఈ ఇద్దరు దిగ్గజాలు మళ్లీ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే.. వారి గురువు, స్వర్గీయ కె. బాలచందర్ ఎంతో గర్వపడతారని ఈ సందర్భంగా లతా రజనీకాంత్ భావోద్వేగానికి లోనయ్యారు. ప్రస్తుతం రజనీకాంత్ వయసుతో సంబంధం లేకుండా వరుస సినిమాలతో బిజీగా దూసుకుపోతున్నారు. ఆయన గత బ్లాక్‌బస్టర్ హిట్ -జైలర్- చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న -జైలర్ 2- షూటింగ్ ఇప్పటికే ముగింపు దశకు చేరుకుందని లతా రజనీకాంత్ వెల్లడించారు. --సూపర్ స్టార్‌కి అస్సలు విశ్రాంతి లేదు.. ఒక సినిమా తర్వాత మరో సినిమా చేస్తూనే ఉన్నారు-- అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. అలాగే రజనీకాంత్



సినిమా స్క్రిప్ట్‌ల ఎంపికలో తాను ఎలాంటి సలహాలు ఇవ్వనని... తానూ ఒక సాధారణ అభిమానిలాగే ఆయన సినిమాలను థియేటర్లలో ఎంజాయ్ చేస్తానని.. ఆయన ఎల్లప్పుడూ సంతోషంగా ఉంటూ ప్రేక్షకులను అలరించడమే తమకు కావాలని పేర్కొన్నారు. సినిమాలతో పాటు తన సామాజిక సేవా కార్యక్రమాల గురించి కూడా లతా రజనీకాంత్ మాట్లాడారు. సమాజంలో స్థానిక, ప్రాంతీయ నాయకత్వాన్ని ఉత్తమంగా పెంపొందించడానికి.. సహజసిద్ధమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడానికి... అలాగే భారతీయుల మధ్య సామాజిక బంధాలను బలోపేతం చేయడానికి తాము కొత్తగా -మక్కల్ మేడై- అనే పౌర వేదికను ప్రారంభించినట్లు తెలిపారు. అయితే భవిష్యత్తులో ఈ వేదిక రాజకీయ పార్టీగా మారే అవకాశం ఉందా? అనే ప్రశ్నకు సమాధానమిస్తూ.. ప్రస్తుతం తాము భవిష్యత్తు గురించి కాకుండా కేవలం వర్తమానం కోసమే పనిచేస్తున్నామని... రాజకీయాలపై ఇప్పుడే వ్యాఖ్యానించలేనని లతా రజనీకాంత్ స్పష్టం చేశారు. ఏది ఏమైనా.. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో .. సినిమా వర్గాల్లో లతా రజనీకాంత్ చేసిన వ్యాఖ్యలు తెగ వైరల్ అవుతున్నాయి.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555